క్లుప్తంగా

సురక్షిత ప్రయాణమే లక్ష్యం



డిపోను పరిశీలిస్తున్న ఖుస్రోషాఖాన్

గజ్వేల్‌రూరల్/దుబ్బాక/సిద్దిపేటకమాన్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమని హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట ఆర్టీసీ డిపోలను తనిఖీ చేశారు. బస్‌స్టేషన్ నిర్మాణ పనులు, గజ్వేల్ బస్‌బే పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలని సూచించారు. రక్షాబంధన్ స్పెషల్ ఆపరేషన్‌లో రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం, రీజియన్‌లో 1వ స్థానంలో నిలవడంపై జీపీపీ డిపో ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ కృష్ణమూర్తి, డిపో మేనేజర్ పవన్, అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, ఏఎంఎఫ్ జమీల్ పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చండి



నీళ్లకోసం ఎదురుచూస్తున్న కాలనీ వాసులు

హుస్నాబాద్: పట్టణంలోని డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. కాలనీలో శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మూడు రోజుల నీళ్లు రావడం లేదని, బిందెలు బయట పెట్టుకొని ఎదురు చూస్తున్నామని వాపోయారు. అధికారులు ఒక్క ట్యాంకర్‌ను పంపించి మనిషికి మూడు బిందెల నీళ్లు ఇస్తున్నారని, అవి ఎవరికి సరిపోతాయని ప్రశ్నించారు. పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉండటం వల్ల తమను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్వాస ఆడటం లేదు..



వాహనాల రాకతో లేచిన దుమ్ము

హుస్నాబాద్‌రూరల్: నిత్యం తిరుగుతున్న మట్టి టిప్పర్ల వల్ల రేగుతోన్న దుమ్ముధూళి తో శ్వాస ఆడటంలేదని ఆగ్రహించిన పోతారం (ఎస్) గ్రామస్తులు శుక్రవారం కొన్ని మట్టి టిప్పర్లను అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోతారం(ఎస్) ఊరు నుంచి మట్టి టిప్పర్ల రాకపోకల వల్ల దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్డు పక్క ఇళ్ల వాళ్లు నిద్ర కూడా పోలేకపోతున్నారని, దగ్గు, ఆయాశం లాంటి వ్యాధుల బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మట్టి టిప్పర్లను దారి మళ్లించాలని డిమాండ్ చేశారు.

జీవఎరువులే పంటకు మేలు



వరిని పరిశీలిస్తున్న ఏఈఓ నాగార్జున

తొగుట(దుబ్బాక): జీవఎరువులతోనే పంటలకు ఎంతో మేలు చేకూరుతుందని ఏఈఓ నాగార్జున తెలిపారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లిలో రైతు మెట్టు స్వామి జీవ ఎరువుతో సాగుచేసిన వరి పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు జీవ ఎరువులు వినియోగిస్తే భూసారం పెరుగుతుందన్నారు. జీవ ఎరువు అజోస్పిరిల్లమ్‌తో కావాల్సిన నత్రజని దొరుకుతుందని చెప్పారు. జీవ ఎరువులను రసాయన ఎరువులతో కలిపి వాడొద్దని సూచించారు.

రైల్వేస్టేషన్ మంజూరుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో రైల్వేస్టేషన్ ఏర్పాటు నిర్ణయంపై బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు శుక్రవారం మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ స్టేషన్ మంజూరు కావడం హరీశ్‌రావు కృషి ఫలితమేన్నారు. రైల్వేస్టేషన్ కోసం భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ కనకరాజు, ఉమేష్ చంద్ర, శ్రీనివాస్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కానరాని పారిశుద్ధ్య నిర్వహణ

- విజృంభిస్తున్న విషజ్వరాలు
- పట్టించుకోని అధికారులు



మంచినీళ్లబండ గ్రామంలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు.. పెరిగిన పిచ్చిమొక్కలు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. మండలంలోని మంచినీళ్లబండ, గొల్లకుంట గ్రామాల్లో ఎక్కడ చూసినా మురుగుకాల్వలు భయపెడుతున్నాయి. శుభ్రం లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీంతో గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. గొల్లకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నలుగురు చిన్నారులు ఉండగా, కొన్ని రోజులుగా వారందరూ విషజ్వరాలతో బాధపతున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రం వెలవెలబోతోంది. గ్రామంలో రోజురోజుకు విషజ్వరాల తీవ్రత ఎక్కువవుతోందని ఆమె చెప్పారు.

దోమలు, ఈగల మోత

గ్రామాల్లోని రోడ్లపై మురుగునీరు పారుతోంది. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు సీజనల్ వ్యాధులతో మంచాన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. నిలిచిన నీటిని తొలగించాలని, వీధులు, డ్రైనేజీలు శుభ్రంచేయించి ఫాగింగ్ చేయించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



ధ్వంసమైన రోడ్డు

గుంతల రోడ్డు.. ఇబ్బందులు ఎన్నాళ్లు?

చేర్యాల(సిద్దిపేట): పట్టణకేంద్రంలోని ప్రధాన రహదారి నుంచి బాలాజీ టాకీస్, శ్రీనగర్ కాలనీ మీదుగా నర్సాయపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మరింతగా దెబ్బతినడమే కాకుండా గుంతలన్నీ వర్షపు నీటితో నిండడంతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రోడ్డుపై భయంభయంగా ప్రయాణం చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్, అధికారులు ఈ రోడ్డుపైనే మున్సిపల్ కార్యాలయానికి వెళ్తూ వస్తుంటారు. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



భూమిపూజ చేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేటరూరల్: గ్రామాలను అభివృద్ధి చేసుకోవడంలో నాయకులంతా సమష్టిగా ముందుకు సాగాలని ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. నారాయణరావుపేట మండల పరిధిలోని శేఖర్‌రావుపేట జీపీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన పంచాయతీల ఏర్పాటుతో పథకాలు పూర్తి స్థాయిలో అందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్, స్వామి తదితరులు పాల్గొన్నారు. రైతులకు సరిపడా యూరియా అందించేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు ఆయనకు వినతిపత్రం అందించారు.

బంద్ విజయవంతం

- మూతపడ్డ విద్య, వ్యాపార సంస్థలు
- భారీగా పోలీసుల మోహరింపు
- ఆందోళన కారుల అరెస్టు



దుబ్బాకలో బంద్‌తో మూతపడ్డ దుకాణాలు



గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత, వ్యాపార సంఘాల నాయకులు

దుబ్బాక: 'మార్వాడీ హఠావో.. దుబ్బాక బచావో..' అనే నినాదంతో దుబ్బాక వర్తక వ్యాపార సంఘం శుక్రవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. అందులో భాగంగా పట్టణంలో వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. గతంలో జరిగిన ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని పోలీసు బలగాలను భారీగా మోహరించారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కీర్తిరాజుతోపాటు పారామిలటరీ బలగాలతో పట్టణంలోని ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో బందోబస్తు నిర్వహించారు. వ్యాపార సంస్థలను బంద్ చేయిస్తున్న ఆందోళనకారులను పోలీసులు అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ దుబ్బాక పరిరక్షణ సమితి నాయకులు మచ్చ శ్రీనివాస్, కాల్వ నరేశ్, ఆకుల భరత్ ఆందోళన చేపట్టారు.

చేతి వృత్తిదారులకు అన్యాయం

మర్కూక్(గజ్వేల్): మార్వాడీల వల్ల చేతి వృత్తులపై ఆధారపడే వారికి తీవ్రమైన అన్యాయం జరుగుతోందని జిల్లా స్వర్ణకారుల సంఘం నాయకుడు కటకం అరవింద్‌చారి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్వాడీలు గ్రామాల్లోకి వచ్చి అధిక ధరలకు అమ్మడం వల్ల స్థానికంగా ఉన్న చిన్న వ్యాపారులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. చేతి వృత్తులను రక్షించేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు.

ఉపాధి కోల్పోతున్న వారిని ఆదుకోండి

గజ్వేల్‌రూరల్: ఉపాధిని కోల్పోతున్న చేతివృత్తుల వారిని కాపాడాలని, మార్వాడీ వ్యాపారాలపై నియంత్రణ చట్టం చేయాలని వృత్తిదారులు, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 'మార్వాడీ గో బ్యాక్' నినాదంతో ఓయూ జేఏసీ చేపట్టిన బంద్‌లో భాగంగా శుక్రవారం గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహించారు. పలువురు వ్యాపారులు స్వచ్ఛంధంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నాల కుమార్, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు బాలచారి, మనుమయ సంఘం అధ్యక్షుడు వెంకటచారి మాట్లాడారు. మార్వాడీలు తెలంగాణలో వ్యాపారాలు చేస్తూ సంపదను తమ రాష్ట్రాలకు తరలించుకుపోతున్నారని మండిపడ్డారు. ఆంజనేయులు చారి, మురళీచారి, రమేశ్‌చారి, రామచంద్రచారి, విఠలాచారి, లక్ష్మీనర్సింహాచారి, శివ, నందన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెదరూరల్(హుస్నాబాద్): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. బస్వాపూర్‌లో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేశారు. అలాగే ఆరేపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. తీగలకుంటపల్లి నుంచి శ్రీరాముపల్లి వరకు రూ.1.5 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తాన్నన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, ఆర్డీఓ రామూర్తి, డీఆర్‌డీఓ జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.



బస్వాపూర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం

ప్రతిపక్షాలపై విమర్శలు సరికాదు



యూరియా కొరత తీర్చాలని ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

యూరియా కోసం బీఆర్‌ఎస్ నేతల రాస్తారోకో

హుస్నాబాద్: రైతులకు సరిపడా యూరియా అందించడంలో విఫలమై ప్రతిపక్షాలను విమర్శించడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. యూరియా కొరత తీర్చాలని స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా కొరతతో రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారన్నారు. ప్రతిపక్షాలే రైతులను రెచ్చగొడుతూ ఆందోళనలు చేయిస్తున్నాయని మంత్రి నాగేశ్వర్ బాధ్యతా రహితంగా మాట్లాడారని, ప్రతిపక్షాలపై ఆరోపణలు మాని ఇంటలిజెన్స్ రిపోర్టు తెప్పించుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. తమపై విమర్శలు మాని రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్వర్‌పాష, మల్లికార్జున్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, భాగ్యరెడ్డి, నవీన్, రాజు, హరీశ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటీరియర్ ఆర్కిటెక్చర్‌లో రమ్యశ్రీరెడ్డికి అవార్డు



అవార్డు అందుకుంటున్న రమ్యశ్రీరెడ్డి

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన దేవిరెడ్డి రమ్యశ్రీరెడ్డి ఇంటీరియర్ డిజైన్‌లో ఎక్సలెన్స్ అవార్డు పొందారు. బెంగుళూర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన 450 మంది ఆర్కిటెక్చర్ల కాన్ఫరెన్సులో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రమ్యశ్రీరెడ్డి మాట్లాడుతూ ఇంటీరియర్ ఆర్కిటెక్చర్‌లో రాణించాలన్న లక్ష్యంతో కష్టపడి బీటెక్ పూర్తిచేసి సొంతంగా ఫౌండెడ్ సంస్థను ఏర్పాటు చేశానన్నారు. పలు గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటీరియర్ డిజైన్లు అందించానని చెప్పారు. తన శ్రమకు తగిన అవార్డు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు.

బాధితులకు పరిహారం

సిద్దిపేటకమాన్: హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు కేంద్రం ప్రభుత్వం పరిహారం అందిస్తున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని అన్ని స్టేషన్ హౌస్ అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ కేసుల్లో మృతి చెందిన బాధితులకు రూ.2 లక్షలు, తీవ్ర గాయాలైన వారికి రూ.50 వేలు అందించనున్నట్లు తెలిపారు. పోలీసు అధికారులు ఈ పథకం గురించి బాధితులకు వివరించాలని సూచించారు.

జానపదం మన జాతి సంపద

ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత

సిద్దిపేటఎడ్యుకేషన్: జానపదాలు పల్లె జీవనానికి ప్రతీకలని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల తెలుగుశాఖ, భాషా సాంస్కృతిక విభాగం, ఎన్ఎస్ఎస్‌ల సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జానపద సాహిత్యం, కళలు, సంప్రదాయాలు మన జాతి సంపదగా అభివర్ణించారు. తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కదారి సాయిసురేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులు జానపద గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, ఎన్‌సీసీ కేర్‌టేకర్ కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

కాళేశ్వరం తెలంగాణ గుండె చప్పుడు

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

మర్కూక్(గజ్వేల్): కాళేశ్వరం అంటే తెలంగాణ గుండె చప్పుడు అని రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కొండపోచమ్మ సాగర్‌లో నీటి పంపింగ్ ప్రారంభం కావడంతో పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పాండుగౌడుతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి రైతులకోసం పోరాడితే ప్రాజెక్టులలోకి నీటిని వదిలారన్నారు. ఆయన వెంట కృష్ణయాదవ్, కనకయ్య, బాల్‌రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టుల వల్లే..

తొగుట(దుబ్బాక): నాడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల నుంచి వచ్చే నీళ్లతోనే మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిండుతోందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న పంపింగ్ ప్రక్రియను శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను లేఖలు రాయడం వల్లే నీటిని విడుదల చేశారని హరీశ్‌రావు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంట నరేందర్‌రెడ్డి, అక్కం స్వామి, భూపాల్‌రెడ్డి, రవీందర్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

నేడు 'చలో హైదరాబాద్'

మిరుదొడ్డి(దుబ్బాక): ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శనివారం హైదరాబాద్ లోని ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసో సియేట్ అధ్యక్షుడు జి.తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొండాపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, జానకీరాములు, మల్లేశం, రామచంద్రం, శివాజీ, శ్రీనాథ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న రాజీవ్ రహదారి ముట్టడి

జేఏసీ చైర్మన్ నర్సయ్య

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ 25న నిర్వహించనున్న రాజీవ్ రహదారి ముట్టడిని జయప్రదం చేయాలని జేఏసీ చైర్మన్ వకుళభరణం నర్సయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని వాసవీగార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని అనేక ఉద్యమాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ప్రజల ఆకాంక్షను గుర్తించి రెవెన్యూ డివిజన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రహదారి ముట్టడికి నాలుగు మండలాల ప్రజలు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, యువత హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, ముస్త్యాల నాగేశ్వర్, పాండు, కరుణాకర్, సంజీవులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి పనుల జాతరలో భాగంగా మండల కేంద్రంలో నాలుగు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి శుక్రవారం అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఏఈ ఇర్ఫాన్ హుసేన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అముతుల్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇంజనీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్

సిద్దిపేటఅర్బన్: ఇంజనీరింగ్ విద్యతో మంచి భవిష్యత్ ఉంటుందని టాలెంట్ ఆక్విజేషన్ హెచ్ఆర్ మేనేజర్ సుష్మ, ఇందూర్ కళాశాల కరస్పాండెంట్ కృష్ణారావు అన్నారు. ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఓరియంటేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో వినయ్‌బాబు, వీపీ రాజు, రాకేష్ రెడ్డి, పద్మావతి, రహీం సుల్తానా పాల్గొన్నారు.

◆ నిబంధనలు తప్పనిసరి

సిద్దిపేటఅర్బన్: వినాయక నవరాత్రుల నిర్వహణలో పోలీసుల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ సూచించారు. వినాయక మండపాల చేసుకునే ఆర్గనైజర్లు, కార్యవర్గ సభ్యులతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించారు. ఏఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

◆ డీజే ఆపరేటర్లు బైండోవర్

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిధిలోని 12 మంది డీజే ఆపరేటర్లను ఎస్ఐ రాజు తహసీల్దార్ దివ్య ఎదుట శుక్రవారం బైండోవర్ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంగించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ చేర్యాల ఎంపీడీఓగా శ్రీనివాస్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల ఎంపీడీఓగా చిలుముల శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన మహబూబ్ అలీ సస్పెండ్ అయిన విషయం తెలిసిందే.

◆ సమయపాలన ముఖ్యం

కొండపాక(గజ్వేల్): విద్యార్థులకు అర్థం అయ్యే పద్ధతుల్లో బోధిస్తేనే మంచి ఫలితాలిస్తాయని మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య అన్నారు. సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ భాగ్యలక్ష్మి పరిశీలించారు. అనంతరం గాగిల్లాపూర్‌లో ఈజీఎస్‌లో రూ.3 లక్షలతో నిర్మించిన పైడిపల్లి లక్ష్మి పౌల్ట్రీఫారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ లింగాకర్షణ బుట్టల అందజేత

బెజ్జంకి(సిద్దిపేట): ఎల్‌డీసీ జాగృతి, మారీ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో రైతులకు లింగాకర్షణ బుట్టలను అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థల ప్రతినిధులు అఖిలేష్, రాజు మాట్లాడుతూ పత్తి పంటకు ప్రధాన శత్రువు గులాబీరంగు పురుగు అన్నారు. ఈ పురుగు నివారణ, నష్టపరిమితి తగ్గించేందుకు ఈ లింగాకర్షణ బుట్టలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఏఓ సంతోష్, ఏఈఓ భరత్, రమేశ్, మహేశ్, శ్రావణి, మనిషా, దేవేందర్ పాల్గొన్నారు.

◆ మొదట నిర్మించిన వారికి నజరానా

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ప్రతి గ్రామంలో మొదటగా ఇందిరమ్మ ఇల్లు నిర్మించిన లబ్ధిదారులకు రూ.10 వేలు నగదుతోపాటు దంపతులకు దుస్తులు ఇస్తామని మాజీ ఎంపీపీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు వేగంవంతంగా ఇళ్లు నిర్మించుకుని రూ.5 లక్షలు పొందాలని సూచించారు.

నిధులు తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే..

నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట అభివృద్ధికి రూ.2.60 కోట్లు తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ అన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే హరీశ్‌రావు చేశారని ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రంగనాయక, మల్లన్నసాగర్ కాలువలకు భూమిలిచ్చిన వారికి పరిహారం ఇవ్వకుండా బీఆర్‌ఎస్ మోసం చేసిందని ఆరోపించారు. యూరియా కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని, కానీ రాష్ట్రప్రభుత్వంపై విషప్రచారం చేయడం సరికాదన్నారు. అత్తు ఇమామ్, బొమ్మల యాదగిరి, కలీమొద్దిన్, మార్క సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990